విజయసాయిరెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదం

ఆయనపై కేసు నమోదు చేయాలి : కాంగ్రెస్ నాయకులు


ఏసీపీ మనోహర్‌కు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఓల్డ్ మలక్‌పేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంపై ఏపీ ఎంపీ విజయసాయిరెడి చేసిన అనుచిత వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని, ఆయన తక్షణమే సీఎం రేవంత్‌రెడ్డికి క్షమాపణ చెప్పాలని మలక్‌పేట కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, చౌకి రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మలక్‌పేట కాంగ్రెస్ నాయకులు సౌత్‌ఈస్ట్ జోన్ అడిషనల్ కమిషనర్ మనోహర్‌ను కలిసి విజయసాయిరెడ్డిపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయసాయిరెడ్డి వ్యాఖ్యల వెనుక ఏదో కుట్రదాగి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల రాజు, రామక్రిష్ణ, మహ్మద్‌గౌస్ తదితరులు పాల్గొన్నారు.



పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, కార్పొరేటర్ శ్వేతారెడ్డి

లక్ష్మీనగర్ కాలనీ థీమ్ పార్క్ ప్రారంభం

సైదాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన మల్టీ జనరేషన్ థీమ్ పార్కును బుధవారం యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి ప్రారంభించారు. కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న నగరంలో మరిన్ని అత్యాధునిక థీమ్ పార్కులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి జి.రవీందర్‌రెడ్డి, హౌసింగ్ సొసైటీ సభ్యులు బాలకృష్ణగౌడ్, ప్రఫుల్లకుమార్, కె.శ్రీనివాస్, జీహెచ్‌ఎంసీ సర్కిల్-7 డీసీ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

సైదాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సక్రమంగా లేని యువకుడు అదృశ్యమయ్యాడు. మాదన్నపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెహిదీపురాలో నివాసముండే మహ్మద్ సల్మాన్‌ఖాన్(23)కు మానసిక స్థితి సక్రమంగా లేదు. ప్రతిరోజూ మధ్యాహ్నం సమీపంలోని మసీదుకెళ్లి ప్రార్థన చేసి ఇంటికి వచ్చేవాడు. సోమవారం మధ్యాహ్నం వెళ్లి తిరిగిరాలేదు. అతడి కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు కుటుం సభ్యులు మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలోని మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని డీఈ హన్మంతరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11కేవీ సింగరేణి కాలనీ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సరస్వతీనగర్ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ తెలిపారు.

ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన అంబేడ్కర్ సంఘం నేతలు

మన్సూరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌ను తెలంగాణ అంబేడ్కర్ సంఘం ఉపాధ్యక్షుడు డప్పు వినోద్, కురుమ సంఘం గ్రేటర్ కార్యదర్శి షైల శ్రీనివాస్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మజ్జిగ లక్ష్మారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా పెద్దఅంబర్‌పేట్‌కు చెందిన ఆ పార్టీ సీనియర్ నేత మజ్జిగ లక్ష్మారెడ్డిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి బుధవారం లక్ష్మారెడ్డికి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన ఈ పదవీబాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానన్నారు.

సీసీ, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ 20వ వార్డులో సీసీరోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనులకు కౌన్సిలర్ జోర్క గీతాశ్రీరాములు కమిషనర్ రవీందర్‌రెడ్డితో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ కాలనీవాసుల సమస్యను దృష్టిలో పెట్టుకుని ఈ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, విజయశేఖర్‌రెడ్డి, కొండల్‌గౌడ్, సురేష్, లింగం, శ్రీనివాస్‌గౌడ్, మచ్చారెడ్డి, శంకర్‌యాదవ్, బాలకృష్ణ, అంజయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


తాగునీటి సరఫరాను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

బడంగ్‌పేట్ మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తదనుగుణంగా సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. బాలాపూర్ 18వ డివిజన్‌లోని శ్రీబాలాజీ టౌన్‌షిప్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన తాగునీటి సరఫరాను బుధవారం కార్పొరేటర్ బండారి మనోహర్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు నేనావత్ బాలూనాయక్, ఎర్ర మహేశ్వరీజైహింద్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు పన్నాల రాజేందర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ గోపురం పనులు ప్రారంభం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్‌లో పునఃనిర్మాణంలో ఉన్న పురాతన శ్రీహనుమాన్ దేవాలయ గోపురం నిర్మాణం పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తిగా నాణ్యమైన రాతి శిలలతో, రెండు శతాబ్దాలపాటు చెక్కుచెదరని రీతిలో ఆలయ నిర్మాణం చేపడుతున్నట్టు చెప్పారు. దాతల సహకారంతో నిర్మాణ పనులు వేగంగా నిర్వహిస్తున్నామని, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయాన్ని తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

విద్యార్థినిపై పీఈటీ లైంగిక వేధింపులు

ఆదిభట్ల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థినిపై పీఈటీ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ స్కూల్ క్యాంపస్‌లో చోటుచేసుకుంది. ఈ మేరకు బుధవారం బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ స్కూల్లో చదివే విద్యార్థినిపై పీఈటీ ప్రకాశ్ కొంత కాలంగా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు ఫోన్ చేసి మరీ వేధిస్తుండేవాడని దీంతో బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తుర్కయంజాల్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

హయత్‌నగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఐదు సంవత్సరాలలో తుర్కయంజాల్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఆయన తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని 7, 8, 9, 10, 20 వార్డుల్లో 3.5 కోట్ల రూపాయలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిందన్నారు. ప్రజల కోసమే ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అధికారులు పద్ధతి మార్చుకోవాలని కోరారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు 20వ తేదీన వేతనాలు ఇచ్చేదని, తాము అధికారంలోకి రాగానే 1వ తేదీనే వేతనాలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు అన్నిశాఖల అధికారులు తప్పకుండా రావాలన్నారు. మున్సిపాలిటీలోని ప్రభుత్వ పార్కులను రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎవరు కబ్జా చేసినా సహించేది లేదని హెచ్చరించారు. అన్ని పార్కు స్థలాలను పరిశీలించాలని కమిషనర్‌ను ఆదేశించారు. రేషన్, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. పార్కుల అభివృద్ధికి ఎంత ఖర్చు అవుతుందో అంచనాలు వేయాలన్నారు. లోవోల్టేజీ సమస్య ఎందుకు ఉందో చెప్పాలని విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌రెడ్డిని ప్రశ్నించారు. మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ చక్కగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. మార్చి 1వ తేదీ నుంచి నీటి సమస్యలు లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ అనురాధ, వైస్‌చైర్‌పర్సన్ హరిత, కౌన్సిలర్లు కవిత, కుంట ఉదయశ్రీ, రొక్కం అనిత, రేవల్లి హరిత, శ్రీలత, మర్రి మాధవి, మంగమ్మ, భాగ్యమ్మ, అనురాధ, కొశిక ఐలయ్య, నాయకులు శివకుమార్, సామ భీంరెడ్డి, కొంతం వెంకట్‌రెడ్డి, కుంట గోపాల్‌రెడ్డి, ధన్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


డిగ్రీ కళాశాల నూతన భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలాల

చంచల్‌గూడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

మేలో అందుబాటులోకి

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సుమారు రూ.5కోట్లతో నిర్మిస్తున్న చంచల్‌గూడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనం మేలో విద్యార్థులకు అందుబాటులోకి రానుందని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. బుధవారం ఆయన తెలంగాణ విద్యా సంస్థల మౌలిక సదుపాయాల కార్పొరేషన్ సహాయ ఇంజనీర్ సాయి కిరణ్, కళాశాల ప్రిన్సిపాల్ పూలపల్లి వెంకటరమణ, కార్పొరేటర్ షాహిద్‌మూన్‌తో కలిసి కళాశాల భవన నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. ఇప్పటి వరకు 75 శాతం పనులు పూర్తయ్యాయని సాయికిరణ్ ఎమ్మెల్యేకు వివరించారు. మిగతా 25 శాతం పనులకు రూ.కోటి నుంచి రూ.కోటిన్నర వరకు ఖర్చయ్యే అవకాశముందన్నారు.

సింగరేణి గుడిసెవాసులకు ఇళ్లపట్టాలు మంజూరు చేయాలి: జేఏసీ


కార్యాచరణ ప్రకటిస్తున్న జేఏసీ నేతలు

సైదాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీ గుడిసెవాసులకు అదే స్థలంలో ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) నేతలు డిమాండ్ చేశారు. బుధవారం సింగరేణికాలనీలో ఏర్పాటుచేసిన సమావేశంలో సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కోర్ర మోతీలాల్‌నాయక్, జేఏసీ నేతలు తుకారాం, విక్రమ్, సక్రీబాయి మాట్లాడారు. నగరానికి జీవనోపాధి కోసం వలసొచ్చి ప్రభుత్వ మిగులు భూమిలో గత 30 ఏళ్లుగా వేలాది మంది పేదలు గుడిసెలు వేసుకుని ఉంటున్నారని వారు తెలిపారు. ఇక్కడి పేదలకు ప్రభుత్వం రేషన్‌కార్డులు, ఓటర్, ఆధార్ కార్డులు మంజూరు చేసిందని గుర్తుచేశారు. కానీ కొందరు రౌడీ సొసైటీ పేరుతో తమ గుడిసెల స్థలాన్ని కాజేయాలని ప్రభుత్వానికి తప్పుడు సమాచారం ఇస్తున్నారని ఆరోపించారు. త్వరలో గుడిసెవాసులంతా ప్రజాభవన్‌కు తరలివెళ్లి వినతిపత్రం సమర్పించనున్నట్లు ప్రకటించారు. గుడిసెవాసులకు ఇళ్ల పట్టాలు వచ్చే వరకూ ఐక్యంగా పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు షేక్ మహమూద్, ఏలూరు బాబు, బస్సీనాయక్, రవీందర్ నాయక్, గణేష్‌నాయక్, సద్దాం, రవినాయక్, అంజయ్య, చందు, శాంతిబాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది కలుగొద్దు

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): పోలీసు ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తూ ప్రజలకు ఇబ్బంది కలుగకుండా నడుచుకోవాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సూచించారు. ఇటీవల సెవన్‌సీటర్ ఆటో డ్రైవర్లు, ట్రాక్టర్ అసోసియేషన్ ప్రతినిధులకు ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే బుధవారం కర్మన్‌ఘాట్‌లోని కొత్తకాపు యాదవరెడ్డిగార్డెన్స్‌లో సంతోష్‌నగర్, ఎల్‌బీనగర్ ట్రాఫిక్‌పోలీసు అధికారులు, ఆటోడ్రైవర్లు, ట్రాక్టర్ అసోసియేషన్ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెవన్‌సీటర్ ఆటోడ్రైవర్లు తమ ఇబ్బందులను ప్రస్తావించారు. నోఎంట్రీ విధానం ఎత్తివేయాలని ట్రాక్టర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. పోలీసు అధికారులు మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు, ట్రాక్టర్ అసోసియేషన్ ప్రతినిధులు సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. డ్రైవర్లు తమ వాహనాలన క్రమపద్ధతిలో నిలిపి ట్రాఫిక్‌కు ఇబ్బందిలు కలుగకుండా చూసుకోవాలని సూచించారు. రాంగ్‌రూట్‌లో వెళ్లవద్దని, మద్యం తాగి వాహనాలను నడపవద్దని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రోజురోజుకూ శబ్దకాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో పోలీసు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, ఎల్‌బీనగర్, సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఏసీపీలు నవీన్‌రెడ్డి, సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు నర్సింగ్‌రావు, నర్సింహనాయక్, సెవన్ సీటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంతుయాదవ్, ఉపాధ్యక్షుడు చాంద్‌పాషా, ట్రాక్టర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు దుర్గయ్య, అశోక్, అధ్యక్షుడు మహేష్, ఉపాధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

చంపాపేట మూడుగుళ్ల ఆవరణలో గది కూల్చివేత

● అడ్డుకున్న పోలీసులు


గదిని కూల్చివేస్తున్న దృశ్యం


మూడుగుళ్ల ఆలయాల పరిసరాలు, కూల్చివేతకు గురైన గది ప్రదేశం

చంపాపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చంపాపేటలోని మూడుగుళ్ల దేవాలయాల ఆవరణలో చంపాపేట విలేజ్ పోచమ్మ దేవాలయ కమిటీ వారు పోచమ్మ ఆలయ నిర్మాణానికి అడ్డుగా వస్తోందని ఆ ఆవరణలో గతంలో నిర్మించిన్న ఓ గదిని బుధవారం ఎక్స్‌కవేటర్ ద్వారా కూల్చివేతలు చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి కూల్చివేతను అడ్డుకున్నారు.

చంపాపేట మూడుగుళ్ల ఆవరణలో ఎన్నో ఏళ్ల క్రితం నుంచి రెండు గుడులను రెడ్డి, బీసీ ఇతర కులాలకు, మరొక గుడిని మాదిగ, మరో గుడిని మాల కులాల కోసం నిర్మించుకొని పూజలు కొనసాగిస్తున్నారు. ఇదే ఆవరణలో చాలా ఏళ్ల క్రితం చంపాపేటకు చెందిన స్థానికులు ఓ గదిని నిర్మించి, చంపాపేట క్రికెట్ క్లబ్ పేరుతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఆరేళ్లక్రితం రెడ్డి, బీసీ ఇతరులు పాతగుడి స్థానంలో కొత్తగా పోచమ్మ ఆలయం నిర్మించుకొని పూజలు చేస్తున్నారు. అప్పటి నుంచి క్రికెట్ క్లబ్ గది మధ్యలోనే ఉండి పోయింది. మాదిగ, మాల కులాల వారు ఇటీవల చంపాపేట విలేజ్ పోచమ్మ దేవాలయ కమిటీగా ఏర్పడ్డారు. ఈ కమిటీ వారు తాము గుడి నిర్మించుకుంటామని, మధ్యలో ఉన్న గదిని తొలగించుకోవాలని చంపాపేట క్రికెట్ క్లబ్ నిర్వాహకులకు సూచించారు. గదిలో సిమెంట్ ఇతర సామగ్రి ఉందని కొంత సమయం కావాలని నిర్వాహకులు కోరారు. సమయం గడిచినా గదిని తొలగించక పోవడంతో విలేజ్ పోచమ్మ కమిటీ వారు సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ, సంతోష్‌నగర్ ఏసీపీ, ఐఎస్‌సదన్ ఇన్‌స్పెక్టర్లకు ఈనెల 6న వినతిపత్రాలు అందజేశారు. తాము ఆలయం నిర్మిస్తున్నట్లు, మధ్యలో ఉన్న గదిని కూల్చివేస్తామని వినతిపత్రంలో పేర్కొన్నారు. బుధవారం ఆలయం వద్ద సమావేశం ఉంటుందని, అందరూ రావాలని ప్రకటించుకున్నారు. ఈ సమావేశానికి క్రికెట్‌క్లబ్ నిర్వాహకులు రాలేదు. దీంతో ఆలయం నిర్మించుకుంటున్న వారు గది కూల్చివేతకు పూనుకున్నారు. ఐఎస్‌సదన్ పోలీసులకు సమాచారం తెలియడంతో వారు వచ్చి గది కూల్చివేతను అడ్డుకున్నారు. గది 75 శాతం కూల్చివేతకు గురైంది. ఇరువర్గాల వారిని పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు పిలిపించుకున్నారు. సంఘటన జరిగిన ప్రాంతాన్ని పోలీసు ఉన్నతధికారులు సందర్శించి విరాలను తెలుసుకున్నారు. గుడి ఆవరణలో పోలీసులు గస్తీ ఏర్పాటు చేశారు. పోచమ్మ ఆలయ నిర్మాణ కథ ప్రస్తుతం పోలీస్‌స్టేషన్‌కు చేరింది.

స్కూల్ వ్యాన్‌ను ఢీకొన్న పోలీస్ కారు

● రెండు వాహనాలు ధ్వంసం ● తప్పిన పెనుప్రమాదం


రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన పోలీస్ వాహనం, స్కూల్ వ్యాన్

వనస్థలిపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యం, అతివేగంతో దూసుకొచ్చిన పోలీస్ వాహనం.. స్కూల్ విద్యార్థుల వ్యాన్‌ను ఢీకొట్టింది. పెనుప్రమాదం తప్పింది. విద్యార్థులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వనస్థలిపురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్సూరాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు రోజువారీగా పాఠశాల ముగిశాక తమ ఇళ్లకు వ్యాన్(ఏపీ09ఏజెడ్7699)లో బయలుదేరారు. అదే సమయంలో విజయవాడ జాతీయ రహదారిలో హయత్‌నగర్ నుంచి ఎల్‌బీనగర్‌కు వెళ్తున్న ఓ పోలీస్ ఉన్నతాధికారి వాహనం(టీఎస్09పీఏ3184) నిర్లక్ష్యం, అతివేగంగా వచ్చింది. దీంతో పనామ వద్ద ముందుగా వెళ్తున్న స్కూల్ విద్యార్థుల వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఆపై డివైడర్‌పై ఉన్న స్తంభాన్నీ ఢీకొంది. విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. రెండు వాహనాలు ధ్వంసమయ్యాయి. సాయంత్రం కావడంతో సంఘటన స్థలం వద్ద భారీగా ట్రాఫిక్‌జామైంది. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి ధ్వంసమైన వాహనాలను తొలగించి, ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. స్వల్ప గాయాలైన విద్యార్థులకు సమీపంలోని ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించి, వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చెస్తున్నారు. ఇదిలా ఉండగా పోలీస్ వాహనాన్ని నడిపిన డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు తెలుస్తుంది.


నాలెడ్జ్ సిటీని సందర్శించిన నెదర్లాండ్స్ అంబాసిడర్ మారిసా గెరార్డ్స్ తదితరులు

ఇండియాకు ఐటీ హబ్‌గా హైదరాబాద్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఐటీ రంగంలో హైదరాబాద్ ఇండియాలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో మంచి గుర్తింపు పొందిందని ఇక్కడ పెట్టుబడులకు, ఉపాధికి మంచి అవకాశాలున్నాయని నెదర్లాండ్స్ ఇండియా భూటాన్, నేపాల్ అంబాసిడర్ మారిసా గెరార్డ్స్ అన్నారు. బుధవారం ఆమె నాలెడ్జ్ సిటీలోని డచ్‌కు చెందిన జిబియా సిఎంఐటీ, ప్లానెన్ సాఫ్ట్‌వేర్ సంస్థలను సందర్శించారు. జిబియా సీవోవో కిరణ్ మధునాపంతులతో కలిసి డచ్ కంపెనీలలో పని చేస్తున్న ఉద్యోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ తాను తొలిసారిగా హైదరాబాద్‌కు వచ్చానని ఇక్కడ వ్యాపార పెట్టుబడులు విస్తరించేందుకు స్థానికంగా ఉన్న పరిస్థితులను అధ్యయనం చేయడంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి మాట్లాడబోతున్నట్లు తెలిపారు.

పాఠశాల స్నాతకోత్సవంలో విషాదం..

● ఎల్బీ స్టేడియం సంపులో పడి యూకేజీ బాలుడి మృతి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎల్బీస్టేడియంలో పాఠశాల స్నాతకోత్సవానికి వచ్చిన బాలుడు సంపులో పడి మృతి చెందాడు. స్నాతకోత్సవంలో భాగంగా యూకేజీ సర్టిఫికెట్ అందుకున్న బాలుడిని చూసి మురిసిపోయిన తల్లి తండ్రులకు మనోవేదనే మిగిలింది. స్నాతకోత్సవంలో పాల్గొనడానికి ఎల్‌కేజీ విద్యార్థి మహమ్మద్ ఆహిల్(5) తన తల్లి షఫియా సుల్తానా, సోదరుడితో కలిసి వచ్చాడు. మంగళవారం రాత్రి బహుమతి కార్యక్రమం ప్రారంభం అవుతుండగా.. స్టేడియం గేట్ నెంబరు 10, 11 మధ్య బాలుడు తచ్చాడుతూ పక్కనే ఉన్న గోతిలో కాలు పెట్టగా జారి సంపులో పడిపోయాడు. ఆహిల్ కనిపించడంలేదని తల్లి, ఇతరులు వెతుకుతున్నారు. సంపులో చూడగా జారిపడిన ఆనవాళ్లు కనపడడంతో అందులోకి దిగి బాబును బయటకు తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆహిల్‌ను బషీర్‌బాగ్‌లో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు.



కార్యక్రమంలో అల్లు స్నేహారెడ్డి, ఆస్పత్రి సీఎండీ డాక్టర్ రమేష్ కంచర్ల తదితరులు

'రెయిన్‌బో'లో బటర్‌ఫ్లై ఎసెన్షియల్ ప్రారంభం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పిల్లలు, మహిళలకు హానికరం కాకుండా ఉండే వస్తువులకు సంబంధించిన బటర్‌ఫ్లై ఎసెన్షియల్‌ను రెయిన్‌బో చిల్డ్రన్ ఆస్పత్రిలో అల్లు స్నేహారెడ్డి బుధవారం ప్రారంభించారు. పిల్లలు, మహిళలకు సంబంధించి పూర్తి ఆర్గానిక్ పదార్థాలతో తయారైన ఉత్పత్తులనే ఇక్కడ అందుబాటులో ఉంటాయని రెయిన్‌బో చిల్డ్రన్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ రమేష్ కంచర్ల వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆదర్శ కాంచర్ల, డాక్టర్ ప్రణతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మెగా హెల్త్ క్యాంప్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్ (లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్) విభాగాల్లో పని చేస్తున్న హోంగార్డ్ ఆఫీసర్లకు నిర్వహించిన మెగా హెల్త్ చెకప్ శిబిరం బుధవారం ముగిసింది. క్యాంపు నిర్వాహకులు, మెడికవర్ ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ డా. దుర్గేష్ శివ, మెడికవర్ ఆస్పత్రి సిబ్బంది, సీటీసీ డాక్టర్లు సరిత, సుకుమార్ తదితరులను సీపీ అవినాష్ మహంతి అభినందించారు. కార్యక్రమంలో సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ నర్సింహా కొత్తపల్లి, పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బందితో పాటు వైద్య బృందం పాల్గొన్నారు.

మెడికల్ బిల్లులు అందక జేఎన్‌టీయూ ఉద్యోగుల గగ్గోలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వైద్యానికి సంబంధించిన బిల్లులు సమర్పించి నెలలు గడుస్తున్నా మంజూరు చేయకపోవడంపై జేఎన్‌టీయూలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు, పెన్షనర్లు ఆవేదన వ్యక్తం చేశారు. జేఎన్‌టీయూ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం వర్సిటీ రిజిస్ట్రార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తక్షణమే బిల్లులు మంజూరు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో మాజీ ఫైనాన్స్ ఆఫీసర్ చంద్రశేఖర్, మాజీ డిప్యూటీ రిజిస్ట్రార్ ప్రసాద్ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన కార్మిక విభాగం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు

బాలానగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఏ. శారదారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజీనామా పత్రాన్ని మాజీ మంత్రి కేటీఆర్‌కు పంపినట్లు ఆమె చెప్పారు. కొన్ని సంవత్సరాలుగా కార్మికులకు, కార్మిక నాయకులకు పార్టీపరంగా అవమానాలు జరుగుతున్నాయని, అవమానాలను ఎదుర్కుంటూనే మౌనం వహించానని తన ఆవేదనను వ్యక్తం చేశారు.

విద్య కోసం బడ్జెట్ కేటాయింపులను పెంచాలి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఆల్‌ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్‌ఓ) హైదరాబాద్ జిల్లా 10వ విద్యార్థి మహాసభ బుధవారం జరిగింది. లక్డీకాపూల్‌లోని సామ్రాట్ కాంప్లెక్స్‌లోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన ఈ మహాసభలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య వక్తగా ప్రముఖ రచయిత డాక్టర్ రాపోలు పాల్గొని మాట్లాడారు. నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు జె.మల్లేష్‌రాజ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విద్యాభివృద్ధికి సరిపడా నిధులు మంజూరు చేయలేదని అన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ట్రైబల్ వేల్ఫేర్ అధికారి చందన సర్వే

జాతీయ క్రీడలకు బోయిన్‌పల్లి విద్యార్థులు

బోయినపల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ భోపాల్‌లో నిర్వహించనున్న ట్రైబల్ వెల్ఫేర్ జాతీయస్థాయి క్రీడా పోటీలకు తెలంగాణ నుంచి బోయినపల్లిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ వాటర్ స్పోర్ట్స్ ప్రభుత్వ అకాడమీ విద్యార్థులు 23 మంది ఎంపికయ్యారు. తెలంగాణ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకులు చందన సర్వే ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, లాలూనాయక్, హెచ్‌డబ్ల్యూఓ నీలిమ, కోచ్ భూపాల్ పాల్గొన్నారు.

కేసు వాపసుకు బెదిరించిన భర్తపై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గతంలో పెట్టిన కేసు వాపసు తీసుకోవాలని లేదంటే చంపేస్తానంటూ భార్యను, కుమారుడిని బెదిరిస్తున్న ఓ వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మీనర్సింహనగర్‌కు చెందిన విజయమ్మ, రామచంద్రయ్య భార్యాభర్తలు. పది నెలల క్రితం రామచంద్రయ్య భార్యను కొట్టాడు. గాయపడ్డ ఆమె కుమారుడు శివశంకర్‌తో కలిసి ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. జైలు నుంచి వచ్చాక రామచంద్రయ్య భార్య పిల్లలతో ఉంటున్నాడు. ఇటీవల తనపై పెట్టిన కేసును విత్‌డ్రా చేసుకోవాలని భార్యపై ఒత్తిడితేవడం మొదలుపెట్టాడు. భార్య ఊరెళ్లిన సమయం చూసుకొని కుమారుడిని చంపేస్తానంటూ బెదిరించాడు. విజయమ్మ ఫిర్యాదుమేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నారు.